# ఒక జ్ఞాపకం

-డా. ఎ.పి.విఠల్

"ఏం శేషమ్మా- రా కూర్చో- అట్లా ఆయాసపడుతూ, ఇంతసేపూ బయటనే కూర్చునే బదులు- అక్కడ కాంపౌండర్ రాములు తెలుసుగదా- కొంచెం ముందుగా పంపించమని అడిగి రాకపోయావా?" అన్నాను.

"నాకన్నా పొద్దుగలవచ్చి కూకున్న వాళ్లను కాదని, యెట్టా ముందు రానయ్యా- వాళ్లు మటుకు యేమీ బాద లేకుండా, వూరికినే 'దావఖానా'కు రారు గదా!" అంటూ వచ్చి, స్టూలు మీద కూర్చుంది.

శేషమ్మ ఏడెనిమిది సంవత్సరాలుగా నా పేషంటు. చిన్నతనాన కీళ్ల నొప్పులకు సరిగా వైద్యం జరగకపోయేసరికి ఆ రోగం గుండెకి పాకి, గుండె కవాటాల్లో ఒకటి బాగా దెబ్బతింది. ఆయాసం, దడ, అప్పుడప్పుడు వంటికి నీరుపట్టడం. ఇలాంటి వాటితో తరచుగా హాస్పిటల్‌కు వస్తుంటుంది. నలభై యేళ్లకు మించి వుండవు గాని, యాభై యేళ్లలాగా అనిపిస్తుంది. తలకెప్పుడూ నూనె రాసినట్లుండదు. రాగి జుట్టయింది. కానీ శుభ్రంగా తల దువ్వుకునే వుంటుంది. పచ్చటి మనిషి, ముఖంమీద పెద్దబొట్టు. ఎప్పుడు చూసినా, ముదురాకు పచ్చ రంగు సన్నటి జరీ అంచు ముతక చీర కట్టుకువస్తుంది. శేషమ్మకు ప్రత్యేకత పచ్చరాయి ముక్కుపుడక. అది లేకపోతే శేషమ్మ యెలా వుండేదో!

"శేషమ్మా నీకేం జెప్పాను. నీ జబ్బుకు నేనిచ్చే మందులు కొంత వుపశమనం కల్గిస్తాయే గానీ, గుండెకు ఆపరేషన్ జేస్తే గానీ పూర్తిగా తగ్గదని ఎన్నిసార్లు చెప్పాను? ఉత్తరం రాసిస్తాను. ఒకసారి హైదరాబాదులో ఉస్మానియా ఆస్పత్రికి వెళ్లి చూపించుకుని, ఆపరేషన్ చేయించుకోక తప్పదని" నేనడమూ,

దానికి శేషమ్మ "ఆ... పేట (సూర్యాపేట) కొచ్చేందుకే, గుడ్డెల్లకొస్తన్నయి. ఇగ పట్నం బోతా!... ఇన్నేళ్ల నుండి, నువు మందిస్తున్నవు... రోజులు దొర్లిపోతున్నయి" అని ఆమె అనడమూ...

"పోనీ నేనిచ్చే మందులైనా సవ్యంగా వాడతావా అంటే, అదీ లేదు..." అని నేనంటే...

"జబ్బులు వున్నేనికొస్తే పైనలు పున్నేనికొస్తయ్యా దొరా..." అని శేషమ్మ అనడం మామూలు అయింది.

ఈసారి నేను "ఏం శేషమ్మా- నా వైద్యం అంత ఖరీదుగా మారిందా?" అని తెలుసుకుందామనే అడిగాను.

"అన్నం దినే నోటితో, ఆ మాట అనలేనయ్యా... నువ్వు దేవుడివి. నువ్వు జేయమట్టి యింతకాలం బతికినా. నాకు మాత్తరం తెలవదా... ఇదే ఇంకో సోటయితే మందుల సంగతి యేమో గానీ, పతిసారీ పరీచ్చలకే బోలెడయ్యేది" అంది శేషమ్మ! అప్పుడు ఆమె కళ్లల్లో, నిజాయితీ, కృతజ్ఞత!

"సరేలే... ఇక కుదరదు. నువ్వు ఉస్మానియా ఆస్పత్రికి వెళ్లి చూపించుకోవలసిందే" అని కాస్త దృఢంగానే అన్నాను.

"అది అయ్యే పని గాదు గానీ, పది రోజులకు మందు రాసివ్వు. పాతిక రూపాయలిచ్చి పంపిండు" అంది శేషమ్మ.

."నీతో చెప్పి లాభం లేదు గానీ, చంద్రయ్యను ఒకసారి రమ్మను. మాట్లాడి నిన్ను ఉస్మానియా తీసుకు వెళ్లేందుకు వొప్పిస్తాను" అన్నాను మందు రాసిస్తూ...

"సెంద్రయ్య మాత్తరం యేం జేస్తడు- కాలం ఈ తీరున మండిపోతుంటే. మందులకు ఈ పాతిక యియ్యడమే- మీ సెంద్రయ్యకు శానా కట్టమవుతుంటే."

"ఇక నేను చెప్పేదేముంది గానీ, ఈ మాత్రలు మానకుండా వాడుతూ, విశ్రాంతి తీసుకుంటూ

"అన్నం దినే నోటితో, ఆ మాట అనలేనయ్యా... నువ్వు దేవుడివి. నువ్వు జేయమట్టి యింతకాలం బతికినా. నాకు మాత్తరం తెలవదా... ఇదే ఇంకో సోటయితే మందుల సంగతి యేమో గానీ, పతిసారీ పరీచ్చలకే బోలెడయ్యేది" అంది శేషమ్మ!

వుంటే..." అని నేను పూర్తి జేయకుండానే.

"నేనేం కట్టం జెయ్యనయ్యా... ఇశ్రాంతిగానే వుంటా. ఆడపుటుక పుట్టాను గదా, ఇల్లూడ్చుకుని, గిన్నెలు దోముకుని, గింత వుడకేసుకోవడమే... ఎప్పుడైనా గేదెకు కూసింత గడ్డి కోసుకొస్తా" అంది శేషమ్మ తాను బాగానే విశ్రాంతి తీసుకుంటున్నట్టు.

"ఎందుకులే నీకు చెప్పి ప్రయోజనం యేముంది గానీ, ఆ మందులు ఇంతకు ముందు నువ్వు వాడుతున్నవే... ఆ చిన్న మాత్ర ఉదయం సగం, రాత్రి సగం, ఆ పెద్ద మాత్ర అంతే! తగరంలో మాత్ర మూడు రోజులకొకసారి–" అని చెప్తుంటే శేషమ్మ "నాకు తెలిసినవే గదయ్యా... దండాలయ్యా... మళ్లీ వత్తానయ్యా" అంటూ వెళ్లింది.

ఆ పిదప 15 రోజులకు శేషమ్మ వాళ్ల వూరు తిమ్మాపురంలో ఒక కార్యక్రమానికి హాజరు కావలసి వుండి వెళ్లాను. అక్కడి నిర్వాహకులు "సార్ డిన్నర్ యేర్పాట్లు చేశాము. కానీ మీరు ఈ వూరు యివాళ వస్తున్నారని తెలిసి శేషమ్మ, చంద్రయ్య మిమ్మల్ని వాళ్ల యింటికే భోజనానికి రమ్మని మరీ మరీ చెప్పారండీ... మీ ఇష్టం..." అని అన్నారు. నేను కూడా నన్ను శేషమ్మ వాళ్ల యింటికే తీసుకువెళ్లమన్నాను. నా కార్యక్రమం అనంతరం నన్ను వాళ్లు శేషమ్మ వాళ్ల యింటి వద్ద దింపి, మరో గంటలో తిరిగి వస్తామని వెళ్లారు.

పూరిల్లు అయినా పెద్దదిగానే వుంది. ఇల్లంతా శుభ్రంగా అలికి, ముగ్గులు పెట్టి వుంది. ముందు ఖాళీ స్థలంలో చీకటిలో అంత వివరంగా తెలియపోయినా, యేవో మొక్కలూ అవి వున్నట్లున్నాయి. నన్ను చూడగానే ఆ దంపతుల కళ్లలో సంతోషం. భక్తిభావం నేటికీ మర్చిపోలేను.

"ఎంత భాగ్యం, సాచ్చాత్తు భగవంతుడే మా యింటికొచ్చినాడు" అంది శేషమ్మ. "ఎంత అదురట్టమయ్యా తమరిలాంటారు మాలాంటి పేదోళ్ల యింటికొచ్చారు!" అంటూ మంచం ఒకటి వాల్చి, దానిపై దుప్పటివేసి, తుండుగుడ్డతో దులిపి, కూర్చోమన్నారు. శేషయ్య నేను కూర్చున్న తర్వాత "అయ్యా కొంచెం బ్రాందీ తెచ్చాను. పుచ్చుకుంటారా?" అంటూ లోపలికి వెళ్ళి గాజు గ్లాసులో యేదో తీసుకువచ్చాడు. "నేనలాంటివేవీ తీసుకోను గానీ, చంద్రయ్యా... నీకు నేను బ్రాందీ తీసుకుంటానని యెవరు చెప్పారు?" అని అడిగాను కుతూహలంగా.


"ఎవళ్లు సెప్పలేదయ్యా... పెద్దలు గదా... నేనే అనుకున్నాను."

"పెద్దలయితే, బ్రాందీ తీసుకోవాలని వుందా?" అని అడిగాను. "ఆ దొర ఆరోగ్గానికి మంచిది గాదని అలాంటివి అంటుకోరు..." అంటూ శేషమ్మ తనకు నా విషయం బాగా తెలిసినట్టు "పోనీ, తీపి కల్లుందయ్యా– ఒక్క సెట్టు కల్లు మంచిది చలవజేస్తది గదా" అంది శేషమ్మ...

"శేషమ్మా" అని నేనంటుండగానే "వద్దులే అయ్యా... ఉండు సిటికలో వడ్డిత్తాను" అని లోపలికి వెళ్లింది.

చంద్రయ్యను మంచం మీద కూర్చోమన్నాను. "తమరి సరసన కూకోడమే." "అయితే నన్ను లేచి నిలబడమంటావా" అన్నాను లేవడాని కుద్యమిస్తున్నట్టు! మంచం మీద దూరంగా వొదిగి కూర్చున్నాడు.

శేషమ్మ వచ్చి 'ఇక లెగండి' అన్నది. ఒక స్టూలు మీద పళ్లెంలో వడ్డించారు. అంతకన్నా కొంచెం చిన్న స్టూలు నేను కూర్చునేందుకు వేశారు. ఏవో నాలుగయిదు రకాలు, కూరలు, పచ్చళ్లు, గారెలు వడ్డించి వున్నాయి. నేను భోజనం చేస్తున్నంత సేపు చంద్రయ్య నిలబడే వున్నాడు.



శేషమ్మ, కలుపు కలుపుకూ మారు అడుగుతూనే వుంది. వాళ్ల అమాయకపు ఆరాధనకు నా కళ్లు చమరుస్తున్నాయి. యేం ఘనకార్యం చేశానని యింతటి ఆరాధన? నేను తింటున్నంతసేపు నా వైద్య సేవల గూర్చి ప్రత్యేకించి, తమ కుటుంబానికి శేషమ్మకు చేసిన 'సహాయాన్ని' గుర్తు చేస్తూనే వున్నారు. నాకు యిబ్బందిగా వుంది. "నువ్వే లేకపోతే శేషమ్మ యేనాడో సచ్చిపోయేదయ్యా... మా దీవం ఆరిపొయ్యేది" అంటున్నాడు చంద్రయ్య.

"ఏంటి చంద్రయ్యా నీ పొగడ్తలు! నీకు వ్యవసాయం తెలుసు, చేస్తున్నావు. నేను వైద్యం చదివాను. అది నాకు కొంచెం తెలుసు. చేస్తున్నాను."

"అలా అనకండయ్యా... మాదేంది మోటుపని యెవుళ్లయినా చేయగలరు..." చంద్రయ్య సమాధానం.

"ఎవరి సంగతి, యేమో గానీ నేను చెయ్యలేను" అన్నాను. మనసులో తామెంతో కష్టపడుతూ నన్ను డాక్టర్ని చేసిన మా అమ్మా నాన్నలకు నమస్కరించుకున్నా.

శేషమ్మ తిరిగి గారెలు వడ్డించబోయింది.

ఏం, ఆమాత్రం పెరుగు అడగకుండా వుండలేకపోయానా? పెరుగు వుంటే, వాళ్లే తెచ్చి వడ్డించేవారు గదా! ఏమైంది నా సంస్కారం!! ఛీ... ఎంతగా వాళ్లను కష్టపెట్టాను... అని నా మనసులో ఎన్నిసార్లు చెంపలు వాయించుకున్నానో...

"చాలు. చాలు. శేషమ్మా- ఇప్పటికే మీ ఆతిథ్యంతో కడుపు నిండిపోయింది. ఇక పెరుగు తీసుకురా!" అన్నాను. పెరుగు నా భోజనంలో చివరి అంకం గనుక అలవాటుగా!

వాళ్లిద్దరి మొఖాలూ మాడిపోయాయి. వాళ్ల గేదె చూడిదట! ఏదో దొంగతనం చేసినట్లు ఒకరి మొఖాలు ఒకరు చూసుకుంటున్నారు. "నాకు సరే మతి పోయింది. నీ తెలివేం తెల్లారింది? పెద్దలు గడ్డ పెరుగు లేకుండా..." అని శేషమ్మ పూర్తి చేయకుండానే నేను కల్పించుకుని "పెరుగు లేకపోతే యేం కొంపలు మునగలేదు. ఏదో అలవాటుగా అన్నాను" అంటూ లేవబోయాను. కానీ ఆ దంపతులు కోలుకోలేదు.

"ఒక్కక్షణం ఆగయ్యా- రాములమ్మ వాళ్లింట్లో వుందేమో, సెంద్రయ్య సిటికలో తెత్తాడు" అంది శేషమ్మ.

"అక్కర్లేదు శేషమ్మా... యెంతో ఆప్యాయంగా, రుచికరంగా భోజనం పెట్టారు. పెరుగు లేనంత మాత్రాన ప్రేమ తగ్గిందా?" అంటూ లేచాను. కానీ వాళ్ల మామూలు మనుషులు కాలేదు. తామేదో తప్పు చేసినట్లు తలదించుకునే నిలబడ్డారు. నా కడుపులో చెయ్యి పెట్టి కెలికినట్టయింది.

ఏం, ఆమాత్రం పెరుగు అడగకుండా వుండలేకపోయానా? పెరుగు వుంటే, వాళ్లే తెచ్చి వడ్డించేవారు గదా! ఏమైంది నా సంస్కారం!! ఛీ... ఎంతగా వాళ్లను కష్టపెట్టాను... అని నా మనసులో ఎన్నిసార్లు చెంపలు వాయించుకున్నానో...

ఇంతలో కార్యక్రమ నిర్వాహకులు వచ్చారు. "శేషమ్మా, చంద్రయ్యా... ఇక వెళ్లి వస్తాను. మీరు చూపించిన అభిమానానికి, ఆతిథ్యానికి నాకు చాలా సంతోషంగా వుంది. కృతజతలు..." అని నేను చెప్తుండగా... "ఏం జేత్తే మాత్తరు యెందయ్యా పెరుగు..." అని యేదో అనబోతున్నాడు చంద్రయ్య... నేనిక వాళ్ల వంక చూడలేకపోయాను.

*(35 సం.ల నాటి అనుభవం. ఆ రోజుల్లో డాక్టరుకు పేషంట్‌కు యిలాంటి అనుబంధం వుండేది... ఇప్పుడు అక్కడక్కడ యింకా అలాంటి పరిస్థితి లేకపోలేదు. కానీ చాలాచోట్ల ముఖ్యంగా పట్టణాలలో చాలా యాంత్రికమైన- డబ్బు సంబంధమే... మిగులుతున్నది! నాటి స్థితి తిరిగి వస్తుందని ఆశ!)*

◉

## నిశ్శబ్దం

**ఓహ్!**
ఇక్కడేదో విస్ఫోటనం
నీటి చుక్కలో ఒదిగిన సాగరాలు
పొంగి - ఫెటిల్లున పేలినట్లు...
మాటలు దోచుకున్న మౌన ముద్రలు
మరణ మృదంగాల్లా మోగినట్లు...

ఉష్!
ఇక్కడంతా నిశ్శబ్దం
బిందువు విస్తరించిన సింధువై
ఆత్మార్పణం చేసుకుంటున్న దృశ్యం...
మనసు ఏకాంత యవనికలు కప్పుకుని
కలల్ని నెమరేసుకుంటున్న చిత్రం...

అక్కడ ఆందోళన
ఇక్కడ అనుభూతి...
శబ్దాన్ని భరించడం కష్టమే!
నిశ్శబ్దాన్ని మోయడం కూడా...

*-వి.గీతా నాగరాణి*